వేగంగా వాహనాలు నడపొద్దు

చాగల్లు: మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే జరిమానాలు తప్పవని చాగల్లు ఎస్సై రమేష్ తెలిపారు. చాగల్లులో సోమవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 15 కేసులు నమోదు చేశారు.

దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

కొవ్వూరు: ఓ వ్యక్తిపై దాడి చేసిన కేసులో పట్టణానికి చెందిన గుడా సందీప్‌వర్మను సోమవారం అరెస్ట్ చేసినట్లు రూరల్ ఎస్సై జి.సతీష్ తెలిపారు. ఆదివారం రాత్రి ధర్మవరంలో ఘర్షణ పడి అదే గ్రామానికి చెందిన బట్టు శ్రీనును వర్మ కొట్టి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సందీప్‌వర్మను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు.

ఆటో డ్రైవర్‌కు గాయాలు

కొవ్వూరు పెట్రోల్ బంక్ సమీపంలో లారీని వెనుక నుంచి ఆటో ఢీకొన్న ప్రమాదంలో ఆటో డ్రైవర్ షేక్ బాజీకి బలమైన గాయాలయ్యాయి. అతన్ని రాజమహేంద్రవరంలోని ఆసుపత్రికి తరలించారు. దీనిపై తమకు ఫిర్యాదు అందలేదని పట్టణ పోలీసులు తెలిపారు.

దస్తావేజులు పోయినవి

ఏలూరు జిల్లా కొయ్యలగూడెంగ్రామానికి చెందిన **ఆదిమూలం నాగేశ్వరరావు S/o నాగభూషణం (లేటు)** వకు సంబంధించి జంగారెడ్డిగూడెం ఆర్.ఎస్.నెం. 156/1లో 150 గజముల స్థలము డాక్యుమెంటు నెం. 6794 / 2011 గల దస్తావేజులు దేవరపల్లి బస్టాండ్ సెంటర్లో జిరాక్స్ నిమిత్తము వెళుతుండగా పోయినవి. దొరికిన వారు ఈ క్రింది నెంబరుకు తెలుపగలరు. ఫోన్: 9491977345

దేవరపల్లి ఇసుక వాగుకు మోక్షం

- ఎమ్మెల్యే తలారి వెంకట్రావు పరిశీలన
- డ్రైనేజీ నిర్మాణానికి రూ.1.10 కోట్లు



మురుగునీటి కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు తదితరులు

దేవరపల్లి: దేవరపల్లిలో ఇసుక వాగు సమస్యకు మోక్షం కలుగుతోంది. ఈ వాగు మురుగునీటి కాలువతో ఇబ్బంది పడుతున్నామని ప్రజలు గతంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు దృష్టికి తీసుకువెళ్లారు. డ్రైనేజీని అభివృద్ధి చేసి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఈ వాగును పరిశీలించిన ఎమ్మెల్యే వెంకట్రావు వాగుపై డ్రైనేజీ, వేంకటేశ్వరస్వామివారి ఆలయం వద్ద కల్వర్టు నిర్మాణానికి అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. డ్రైనేజీ నిర్మాణానికి రూ.80 లక్షలు, కల్వర్టు నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు చేస్తూ గత నెలలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇసుక వాగును సోమవారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.1.10 లక్షలతో ఇసుక వాగుపై డ్రైనేజీ, కల్వర్టు నిర్మిస్తున్నట్టు తెలిపారు అంబేడ్కర్ సెంటర్లో రూ.4.50 లక్షలతో కల్వర్టు, రూ.4 లక్షలతో డ్రైనేజీ నిర్మిస్తామన్నారు. సొసైటీ అధ్యక్షుడు కవల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ మండల సేవాదళ్ అధ్యక్షుడు మాదవరపు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల: సీఎం జగన్ మహిళలకు అన్నింటా ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కాపు నేతల ఆధ్వర్యంలో శ్రీవారి దేవస్థానం నూతన ట్రస్టుబోర్డు సభ్యురాలు పెద్దిరెడ్డి వెంకటకొండ పద్మ, జ్యోతిశ్రీనివాస్ దంపతులకు కాపు కల్యాణ మండపంలో సోమవారం అభినందన సభ నిర్వహించారు. ఎమ్మెల్యే తలారి పార్టీ నేతలు, కార్యకర్తలతో కలసి పద్మ దంపతులను సత్కరించారు.

'స్పందన'కు ఎనిమిది అర్జీలు

కొవ్వూరు: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి ఎనిమిది అర్జీలు వచ్చాయని ఆర్డీఓ ఎస్.మల్లిబాబు తెలిపారు. పట్టణంలో చేతిపంపులను వినియోగంలో తేవాలని విశ్రాంత ఎంప్లాయిస్ యూనియన్ నాయకుడు పెనుమాక జయరాజు అర్జీ ఇచ్చారు. కుమారదేవంలో ఇటుక బట్టీలతో పంటలకు నష్టం కలుగుతుందని గొరిజాల సురేష్ ఫిర్యాదు చేశారు. చిడిపి గ్రామంలోని లంక భూముల్లో మట్టి తీయకుండా చర్యలు తీసుకోవాలని డి.వెంకటరత్నం తెలిపారు. ఇలా పలు అంశాలపై ఆర్డీఓకు వినతులు అందించారు.

బాధితులకు చేయూత

తాళ్లపూడి: వాదాలకుంటకు పొగాకు మకాం పనికి వెళ్లిన గజ్జరం గ్రామానికి చెందిన 20 కుటుంబాల వారు అక్కడ ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో వారు వేసుకున్న గుడిసెలు కాలిపోయాయి. ఈ విషయం తెలుసుకున్న గజ్జరం సర్పంచ్ గండి రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు వల్లభని శ్రీహరి, ఎంపీటీసీ సభ్యుడు గుంటు చిన్నబ్బాయి తదితరులు తక్షణ సాయం అందజేశారు. నిత్యావసర సరకులు, దుప్పట్లు, టవళ్లు తదితర వాటిని ఇచ్చారు. వల్లభని శ్రీహరి రూ.5 వేల సాయం చేశారు. పాస్టర్ శేఖర్ బియ్యం, కూరగాయలను పంపిణీ చేశారు.

బడ్జెట్ కేటాయింపులకు పరిపాలనా ఆమోదం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి

కొవ్వూరు: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం సోమవారం చైర్‌పర్సన్ భావన రత్నకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా క్రైస్తవ శ్మశాన వాటికలో పిచ్చి మొక్కలు తొలగించి శుభ్రం చేయించేందుకు రూ.78 వేలు సాధారణ నిధులు ఖర్చు చేయాలని కౌన్సిల్ తీర్మానించింది. మున్సిపాలిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా కరుటూరి శంకర్‌రాజును నియమించేందుకు ఆమోదం తెలిపింది. ప్రజారోగ్య విభాగానికి బడ్జెట్‌లో కేటాయించిన రూ.4,33,50,000, తదితర ఖర్చులకు సభ్యులు ఆమోదం తెలిపారు. పట్టణంలో వివిధ రోడ్ల మరమ్మతులకు రూ.7.20 లక్షలతో దాఖలైన టెండర్‌ను ఖరారు చేశారు. వివిధ ప్రాంతాల్లో 40 చోట్ల విద్యుత్‌స్తంభాల ఏర్పాటుకు అనుమతి వచ్చిందని విద్యుత్ శాఖ ఏఈ జగదీశ్వరరావు వివరించారు. 22వ వార్డు కౌన్సిలర్ రమేష్‌బాబు మాట్లాడుతూ విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై స్థానిక కౌన్సిలర్లకు తెలపాలన్నారు. ఇందిరమ్మ కాలనీలో సుమారు వంద వరకూ ఖాళీలున్నాయని, గతంలో కొందరు కొనుగోలు చేసుకుని ఉన్న ఇళ్లకు వారి పేరుతో పన్నులు వేయాలని అడుగుతున్నారని చిన్ని తెలిపారు. కాలనీలో సర్వే చేస్తున్నామని, పూర్తయిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని కమిషనర్ అన్నారు.

నిడదవోలు రూరల్: నిడదవోలు మున్సిపల్ సాధారణ సమావేశాన్ని చైర్మన్ భూపతి ఆదినారాయణ అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నిబంధనల ప్రకారం సమావేశాన్ని జరిపినట్లు కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. పలు అంశాలకు సభ్యులు ఆమోదం తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ సాధనకు పాదయాత్ర

నిడదవోలు రూరల్: ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా కోరుకొండ నుంచి అమరావతి వరకూ మహాజన సోషలిస్ట్ పార్టీ (ఎంఎస్‌పీ) ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు చేపట్టిన మహా సంగ్రామ పాదయాత్ర సోమవారం నిడదవోలు చేరింది. నాగరాజు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చిన బీజేపీ మోసం చేసిందని విమర్శించారు. ముమ్మిడివరపు చినసుబ్బారావు, చెట్టే రామకృష్ణ, భీమడోలు కిరణ్‌కుమార్, గెడ్డం వినోద్ పాల్గొన్నారు.

నిత్యావసరాల పంపిణీ

నిడదవోలు రూరల్: స్థానిక నిడదవోలు జ్యోతిర్మయి దివ్యాంగుల సంక్షేమ సంఘంలో 50 మంది దివ్యాంగులకు డాక్టర్ పీఎస్ఎస్ కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. ట్రస్ట్ చైర్మన్ సతీష్, కృపావర్మ, ఏసు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాల పరిరక్షణకు కృషి

నల్లజర్ల: దేశ వ్యాప్తంగా రామరాజ్య స్థాపనలో భాగంగా రామరాజ్య గోపాలపురం నియోజకవర్గ పాలకుడిగా మామిడి అశోక్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ వ్యవస్థాపకుడు కొవ్వూరి వీరరాఘవరెడ్డి ఆధ్వర్యంలో నల్లజర్ల వేణుగోపాలస్వామి దేవాలయంలో అశోక్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ హిందూ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు తన వంతు కృషి చేస్తానన్నారు.

'మానవత'తో మరిన్ని సేవలు

గోపాలపురం: మానవత స్వచ్ఛంద సంస్థ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు మండల కమిటీ కృషి చేయాలని మండల మానవతా చైర్మన్, జిల్లా కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ రాంబాబు అన్నారు. స్థానిక శర్వాణి హైస్కూల్ ఆవరణలో సోమవారం మండల కమిటీ సమావేశం జరిగింది. సంస్థ మండల అధ్యక్షుడు బూరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ మార్చి 12న రక్తదాన శిబిరం, గ్రామాల్లో చలివేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు.

బాధితురాలికి సాయం

దేవరపల్లి: క్యాన్సర్‌తో బాధపడుతున్న రామన్నపాలేనికి చెందిన కొటాని అశ్రిత్ వైద్య ఖర్చులకు మండల మానవత సంస్థ సభ్యులు సాయం చేశారు. పల్లంట్లలో జరిగిన సంస్థ సమావేశంలో సభ్యురాలు, మాజీ జెడ్పీటీసీ కొయ్యలమూడి సుధారాణి రూ.2,500, బసుసు సత్యనారాయణ రూ.2,500, మానవత సంస్థ రూ.2,500 సాయం చేశారు. సంస్థ మండల అధ్యక్షుడు బండి సూర్యప్రకాశరావు, కార్యదర్శి ఈడ్పుగంటి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తాళ్లపూడి: పెద్దేవంలో మండల మానవత స్వచ్ఛంద సంస్థ సమావేశం సంస్థ కార్యదర్శి సాయన సుబ్బారావు ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. మార్చిలో చేపట్టే సేవా కార్యక్రమాల గురించి సభ్యులు చర్చించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు సాయంత్రం అల్పాహారం అందజేయాలని నిర్ణయించారు. రీజనల్ చైర్మన్ వి.చంద్రయ్య, సభ్యులు సీహెచ్ ఆంజనేయులు, బి.శంకర్, సనపల రాజశేఖర్ పాల్గొన్నారు.

పంట నమోదుకు నేడే తుది గడువు

నల్లజర్ల: రైతులు రబీ పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవడానికి ఈ నెల 28వ తేదీ మంగళవారంతో గడువు ముగుస్తుందని మండల వ్యవసాయాధికారి కె.కమల్‌రాజ్ తెలిపారు. ఈ ప్రక్రియ నెల రోజులుగా సాగుతుందన్నారు. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు తమ పంటలు ఆన్‌లైన్ నమోదయ్యాయా.. లేదా అనే విషయం పరిశీలించుకోవాలని ఆయన కోరారు.

విద్యార్థుల ప్రతిభ

గోపాలపురం: నేషనల్ ఒలింపియాడ్‌లో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థులు 15 మంది ప్రతిభ చాటారని ప్రిన్సిపాల్ టి.ఉమాదేవి సోమవారం తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకూ 45 మంది పాల్గొనగా ఇంటర్‌లో 8 మందికి లెవెల్-2లో గోల్డ్ మెడల్ ఆఫ్ డిస్టెన్క్షన్, మరో ఏడుగురికి మెడల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ వచ్చాయని అన్నారు. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించామన్నారు. వీరికి తర్ఫీదు ఇచ్చిన సైన్స్ టీచర్ కె.రజినీ ప్రశాంతిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

3న మండల పరిషత్ సమావేశం

నిడదవోలు రూరల్: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని మార్చి 3వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ టి.మూర్తిబాబు సోమవారం తెలిపారు. దీనికి సభ్యులంతా హాజరు కావాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

తాళ్లపూడి: ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి.దుర్గారావు అన్నారు. ఈ మేరకు ఏపీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ టి.రాధికకు వినతి పత్రం అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ వేతన సంఘాన్ని నియమించాలన్నారు. సంఘ మండల అధ్యక్షుడు పి.రఘువీర్ శాస్త్రి, శోభన్ బాబు, లక్ష్మీపతి, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.